క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన


మధ్యాహ్న భోజన పథకం వంటలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

నరసాపురం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఎలాంటి లోపాలు లేకుండా అమలు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. శుక్రవారం చైర్‌పర్సన్ పట్టణంలోని 15వ వార్డు మున్సిపల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల పనితీరును ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకంలో వంటలను పరిశీలించారు. అలాగే వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా తనఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. ఆమె వెంట స్థానిక కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి ఉన్నారు.

పీఎంజీఎస్‌ఐ ఇళ్లను పరిశీలించిన కేంద్ర బృందం


మొగల్తూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

మొగల్తూరు: ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజనలో భాగంగా గతంలో నిర్మించిన గృహాలను శుక్రవారం కేంద్ర బృందం తనిఖీలు చేసింది. మినిస్ట్రీ ఆఫ్ కంట్రోల్ అండ్ ఆడిట్ టీమ్‌కు చెందిన నాగర్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం మొగల్తూరు మండలంలో 2016-17 సంవత్సరంలో నిర్మించిన గృహాలను పరిశీలించింది. 2016-17లో మొగల్తూరు మండలంలో 148, నరసాపురం మండలంలో 191 గృహాలను నిర్మించారు. ఆ ఏడాదిలో నిర్మించిన ఇళ్లను పరిశీలించడంతో పాటు ప్రభుత్వం కల్పించిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బృందంలో ఆడిట్ అధికారి ఎస్.ప్రభాకర్ నాయుడు, గురుప్రసాద్, ఈఈ సిద్ధాంతి, ఎంపీడీఓ ఆర్సీ ఆనంద్ కుమార్, ఏఈ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో రోడ్డు పనుల పరిశీలన


మేడపాడు జగనన్న కాలనీలో వేసిన రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని జగనన్న కాలనీలో కొత్తగా వేసిన రోడ్డును శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణంతో కాలనీలో ఇళ్ల నిర్మాణం పుంజుకుంటుందని స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు చెప్పారు. కాలనీలో ఇప్పటికే విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. త్వరలోనే కుళాయిలు కూడా వేస్తామన్నారు. లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని ఆయన కోరారు. ఆయన వెంట స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ పార్టీ నాయకులు అడబాల రామ్మోహనరావు, బాలం అంజిబాబు, దేగల వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పులపర్తి సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు

లేగ దూడల ఎదుగుదలతోనే పశు సంపద వృద్ధి


పాడి రైతులకు సూచనలిస్తున్న జవర్ హుస్సేన్

యలమంచిలి: లేగదూడల సమగ్ర ఎదుగుదలతోనే పశు సంపద వృద్ధి చెందుతుందని పశు సంవర్ధక శాఖ భీమవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జవర్ హుస్సేన్ చెప్పారు. యలమంచిలి సెంటర్‌లోని తమ్మినీడి నరసింహారావు లేఅవుట్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన లేగ దూడల ప్రదర్శన, పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగ దూడ పుట్టిన వెంటనే ముర్రిపాలు తాగించాలన్నారు. దీని వల్ల దూడలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దూడ పుట్టిన తరువాత 10వ రోజున నట్టల నివారణ చేయించాలన్నారు. గోమర్లు, అంతర పరాన్నజీవులు దూడల జోలికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అనంతరం లేగ దూడలకు అందాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. శిబిరానికి దూడలను తీసుకు వచ్చిన రైతులందరికీ ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ పాలకొల్లు డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ మేడా రామశేకర్, యలమంచిలి, దొడ్డిపట్ల పశు వైద్య కేంద్రాల వైద్యులు డాక్టర్ దొమ్మేటి మాధురి, డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర

- వైభవంగా శివయ్య కల్యాణం
- శివాలయాల వద్ద శివరాత్రి సందడి

పెనుగొండ: ఆచంటలోని శ్రీ ఉమా రామేశ్వరస్వామి(ఆచంటేశ్వరస్వామి) వారి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి కల్యాణ వేదికపై కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ శంకరమంచి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి అందే సత్యనారాయణ, నెక్కంటి సత్యనారాయణ, నెక్కంటి బుచ్చేశ్వరరావు, నల్లూరి లీలా మాధవరావు కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పులకించారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి, పార్వతి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అంతకుముందు శ్రీస్వామి వారికి ఎదురు సన్నాహోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి రామచంద్రకుమార్ పాల్గొన్నారు. అనంతరం శ్రీస్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు రథోత్సవం

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని స్వామి వారి దర్శనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయ పరిసరాల చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం స్వామి వారి రథోత్సవం జరగనుంది.

శోభాయమానంగా సోమేశ్వరాలయం

పెనుమంట్ర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జుత్తిగ గ్రామంలోని ప్రసిద్ధిచెందిన శ్రీఉమావాసుకి రవిసోమేశ్వరస్వామివారి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాల అలంకరణలతో ఆలయం కళకళలాడుతోంది. శనివారం తెల్లవారు జామున స్వామివారికి సత్తిరాజు వెంకటేశ్వర్లు, కల్యాణి దంపతులచే స్వామివారికి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఉదయం స్వామివారిని పంచామృతాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించిన అనంతరం సత్తిరాజు సోమేశ్వరరావు, అరుణాదేవి దంపతులతో జగజ్యోతి అఖండ దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మధ్యాహ్నం ధూపసేవ అనంతరం మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు రథోత్సవాన్ని ప్రారంభిస్తారు. రథంలో స్వామివారిని గ్రామోత్సవాన్ని నిర్వహించి, సాయంత్రం జుత్తిగ, నత్తారామేశ్వరం పొలిమేరలో సోమేశ్వరస్వామి వారికి, రామేశ్వర స్వామివారికి సన్నాయి మేళాలతో ఎదురు సన్నాహ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద శుక్రవారం రాత్రి నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


ఆచంటలో ఆచంటేశ్వరుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


జుత్తిగలో విద్యుత్ దీపాలతో సోమేశ్వర ఆలయం


జుత్తిగ సోమేశ్వర ఆలయం వద్ద కూచిపూడి నాట్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం


నత్తారామేశ్వరంలో స్వామివారిని ఊరేగించేందుకు నంది, హంస, జింక వాహనాలను సిద్ధం చేస్తున్న దృశ్యం


మొగల్తూరులో పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు


శివదేవునిచిక్కాలలో కల్యాణోత్సం నిర్వహిస్తున్న దృశ్యం


లక్ష్మణేశ్వరం శివాలయం వద్ద వేసిన పందిళ్లు

రేపు అన్నసమారాధన....

మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 19న జుత్తిగ సోమేశ్వరస్వామివారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ తమనంపూడి వీర్, కొవ్వూరి చిన్నారెడ్డి, గుడిమెట్ల సాయి మురళీరెడ్డి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుల ఆధ్వర్యంలో ఈ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్నానాలకు ఏర్పాట్లు పూర్తి

మహా శివరాత్రిని పురస్కరించుకుని నత్తారామేశ్వరం గ్రామంలోని శ్రీ రామేశ్వరస్వామివారి ఆలయం వద్ద శనివారం తెల్లవారుజామున భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోస్తనీ నదిలో ఉన్న ఆలయ కొలనులో నీటిని నింపి, స్నానాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. అదే విధంగా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారు జామున రామేశ్వరస్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ వీరభద్ర స్వామి, లక్ష్మణేశ్వర స్వామివార్లకు బ్రహ్మశ్రీ పులపర్తి వీరవెంకట సత్యనారాయణ శర్మతో దేవస్థాన అర్చకులు ఆర్.రామలింగేశ్వర రావుశర్మ ఆధ్వర్యంలో వెలగల రామిరెడ్డి, కనక ఉమా మహేశ్వరి దంపతులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారని, మహాశివరాత్రి రోజున తెల్లవారు జామునుంచే గోస్తనీ పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా భక్తులు దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రథోత్సవాన్ని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభించిన అనంతరం స్వామి వారిని రథంపై ఊరేగిస్తూ జుత్తిగ, రామేశ్వరం గ్రామ పొలిమేరవద్ద సోమేశ్వరస్వామి, రామేశ్వరస్వామివారికి బ్యాండు, సన్నాయి మేళాలతో బాణాసంచా కాల్పులతో ఎదురు సన్నాహ ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మహాశివరాత్రికి మండలంలోని శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయం, వడయార్‌పేటలోని వనమల్లికార్జునుడి ఆలయం, ముత్యాలపల్లిలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వర స్వామి ఆలయం, కాళీపట్నంలోని కాళికా సమేత కాళీశ్వర స్వామి ఆలయం పేరుపాలెంలోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయం, కొత్తపాలెం వీరభద్ర స్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణల్లో చలువ పందిరలు, విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్థానిక వడయార్‌పేటలోని శ్రీభ్రమరాంబ సమేత వనమల్లికార్జున స్వయంభూలింగేశ్వరస్వామి వారి 84వ వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి వార్ల కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వార్షికంగా స్వామి వారికి వివాహం జరిపిస్తున్న వేగేశ్న వారి కుటుంబ సభ్యులు, కపిల వారి కుటుంబ సభ్యులతో బ్రహ్మశ్రీ ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి), ర్యాలి సూరిబాబు, ర్యాలి కాశి, ర్యాలి సతీష్, ర్యాలి శివాజీల బ్రహ్మత్వంలో కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఈఓ నామాల రంగరాజన్, ఉప సర్పంచ్ ఆకుల నాగమురళి, అన్నదాన సమాజ కమిటీ, పుష్పాభిషేకం కమిటీ సభ్యులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నందివాహనంపై గ్రామోత్సవం

నరసాపురం రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వర స్వామివారికి శుక్రవారం నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నంది వాహనంపై స్వామివారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతోపాటు మండలంలోని కొప్పర్రు, లిఖితపూడి, ఎల్‌బీచర్ల గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలకు ఈ ఏర్పాట్లు సిద్ధం చేశారు. డీఎస్పీ రవిమనోహర్‌చారి శుక్రవారం లక్ష్మణేశ్వరంలోని శివాలయాన్ని సందర్శించి మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో యాత్రికుల సౌకర్యార్థం చేపట్టిన పనులగురించి ఈఓ చాగంటి సురేష్‌నాయుడును అడిగి వివరాలు తెలుసుకున్నారు.

మూడేళ్ల ప్రగతిని ధైర్యంగా చెబుతున్నాం

మాజీ మంత్రి రంగనాథరాజు


పెనుగొండలో గడపగడపకు మన ప్రభుత్వంలో సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: మూడేళ్ల ప్రతీ గడపకూ సంక్షేమ ఫలాలు అందించి, ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లి చెప్పే గొప్ప అవకాశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కల్పించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం పెనుగొండలో కోడి పందేల దిబ్బ, నగరేశ్వర స్వామి కాల నీ(బీడు), యర్రా నారాయణ స్వామి కాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొని సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కోడి పందేల దిబ్బలో గత ప్రభుత్వం విస్మరించిన రూ.1.25 కోట్లుతో రహదారుల నిర్మాణం చేపట్టామని, విద్యుత్ సదుపాయం కల్పించామని వివరించారు. అదే విధంగా కోటి రూపాయల వ్యయంతో నగరేశ్వర స్వామి కాలనీలో రహదారుల నిర్మాణం, త్రాగునీటి సమస్య తీర్చినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు చేసినా కొందరు దుష్ప్రచారం చేసి ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. వీటిని ఆయా ప్రాంతాల ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. త్వరలోనే కోడి పందేల దిబ్బలో తాగునీటి సమస్య పరిష్కారానికి సొంత ఖర్చులతో ట్యాంకర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.29 లక్షలతో చేపట్టబోయే ట్యాంకు నిర్మాణం పూర్తయ్యే వరకూ ట్యాంకరుతో తాగునీటిని సరఫరా చేస్తామని అన్నారు. ప్రతీ పేదవానికి సంక్షేమాన్ని అందించి సీఎం జగన్ దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. సీఎం జగన్‌ను ఆశీర్వదించి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ తానేటి నాగ మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు తాడి సుబ్బిరెడ్డి, చిన్నం ఏడుకొండలు, డైరక్టరు కుసుమే రాంబాబు, ఉప సర్పంచ్ ఆకెశెట్టి వరలక్ష్మీ చంటి, సేవాదళ్ కన్వీనరు బాలం సత్తిరాజు, పంచాయతీ సభ్యులు ఆదిరెడ్డి సన్యాసిరావు, పార్టీ నాయకులు పలివెల శ్రీను, గాజుల బులిపుల్లారావు, తానేటి రాంబాబు, కొవ్వూరి వేణుమాధవరెడ్డి, పాలసత్తి రాజా, పోడూరి రామయ్య, దేవస్థానం చైర్మన్లు మేడపాటి చిరంజీవి రెడ్డి, కోళ్ల అప్పారావు, పులిగెడ్డ రామారావు, గుడాల దుర్గారావు, నేలపూడి లక్ష్మణరావు, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో జాగ్రత్తలపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తప్పించుకునే ఆ ఒక్క క్షణంలోనే ప్రాణాలను కాపాడుకునే విధంగా ఆలోచన కలగాలని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) 10వ బెటాలియలన్ ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ కొన్ని సూచనలు చేశారు. శుక్రవారం స్థానిక బీఆర్‌ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ విజయవాడ కమాండెంట్ జహీద్‌ఖాన్ ఆదేశాల ప్రకారం విపత్తుల నివారణపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుగుణ సంధ్య, ఆర్‌ఐ పి.త్రిమూర్తులు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పెద్దిరాజు, ఏఎస్ ఆదినారాయణ, ఎంవీఆర్ నాయుడు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు గ్రామానికి చెందిన ఓసూరి హరినారాయణ రాంబాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన ఓసూరి వెంకటస్వామి నాయుడు జ్ఞాపకార్థం విజయవాడకు చెందిన మన్వి ఆసుపత్రి అధినేత ఓసూరి బాల బాలాజీ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా మందులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: శివరాత్రి మహోత్సవాల సందర్భంగా పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలాగే శ్రీ పార్వతి, శ్రీ లక్ష్మీదేవి అమ్మవార్లను, శ్రీ జనార్ధన స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేయించుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. శివరాత్రి పురస్కరించుకుని శివాలయాలనికి వేలాది మంది భక్తులు తరలివస్తారని, వారందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ పాలకవర్గ సభ్యులు, అధికారులకు సూచనలు చేశారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, ఫలహారాలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయానికి విచ్చేసిన జెడ్పీచైర్మన్ శ్రీనివాస్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చక స్వాములు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆయనతో పాటు రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, జడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజుల నాయుడు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీ రెల్లి నరసింహరావు, శ్రీ మన్యం జగ్గమ్మ సత్రం చైర్మన్ నంబూరు శ్రీ గంగా పవన్, పార్టీ నాయకులు పాతూరి రంగరాజు, బండి రమేష్, విశ్వనాథం పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పాటించాలి


ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ ఎంఎల్‌ఎం దేవి

యలమంచిలి: బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత గురించి తెలుసుకోవాలని మేడపాడు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎంఎల్‌ఎం దేవి కోరారు. మేడపాడు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖలో శుక్రవారం ఆమె ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో లబ్ధి పొందాలంటే ప్రతి వ్యక్తికి బ్యాంకు ఖాతా ఉండాలని సూచించారు. బ్యాంకు సీనియర్ ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్ కె రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. డబ్బు ఉన్నపుడు అనవసర ఆడంబరాలకు ఖర్చు చేయకుండా భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ తోట మహంకాళిరావు సిబ్బంది తూము వెంకట శ్రీనివాస్, కె.సత్య చరణ్, పాలపర్తి అవినాష్, చీడే రవికుమార్, చల్లా దేవి, మన్నే స్వప్న, టి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు

పోడూరు: బాల్యవివాహాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయలక్ష్మి అన్నారు. పండితవిల్లూరు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం బాల్యవివాహాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు 18ఏళ్లు నిండాక, బాలురు 21ఏ ళ్లు నిండాక వివాహం చేసుకోవాలని చెప్పారు. బాలికలు చిన్న వయస్సులో వివాహం చేసుకోవడం వల్ల పుట్టే బిడ్డలు అనారోగ్యంగా ఉంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కె.శ్రీనివాసరావు, మహిళా పోలీసు ఎస్.దేవి, హైస్కూలు హెచ్‌ఎం సీహెచ్.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ మీనా, ఏఎన్‌ఎం ఎ.జగదీశ్వరి పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రతీ ఒక్కరూ బాధ్యత వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సత్యవేణి మాట్లాడారు. ఆడపిల్లలకు వివాహ వయస్సు రాకుండా పెళ్లి చేయడం వలన అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ, పాఠశాల హెచ్‌ఎం డీవీ నరసింహారావు, వీఆర్వో బొక్కా సుజాత, ఏఎన్‌ఎం జె విజయశాంతి, మహిళా పోలీస్ వి.వరలక్ష్మి పాల్గొన్నారు.

కొడమంచిలిలో..

పెనుగొండ: బాల్యవివాహాలతో వారి జీవితాల్లోనూ ఎన్నో అనర్థాలు ఎదుర్కొన వలసి వస్తుందని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శుకవ్రారం కొడమంచిలిలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిలుపుదల అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.బాలిక తల్లిదండ్రులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దొమ్మేటి రాంబాబు, స్కూలు కమిటీ చైర్మన్ బోరుసు రాంబాబు, ఏఎన్‌ఎం పుష్పరాజ్యం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పి పోశమ్మ, కె.మోహన్ రాణి, సల్లపూడి సుజాత పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

మొగల్తూరు: ముత్యాలపల్లి పంచాయతీ పరిధిలో కోడి పందాల స్థావరంపై శుక్రవారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద గల రూ.5,120లు నగదు, నాలుగు కోడి పంజులు స్వాదీనం చేసుకున్నట్టు ఎస్సై ఎం.వీరబాబు తెలిపారు.